సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 31 । జనవరి । 2025



వేతనాలు అందక అవస్థలు
ఉమ్మడి జిల్లాలో సమగ్ర శిక్ష ఉద్యోగులు రెండు నెలలుగా వేతనాలు అందక ఇక్కట్లు పడుతున్నారు.
- 8లో ▸



పేలుడు పదార్థాలు..
బాన్సువాడ పట్టణంలోని పాత వీక్లీ మార్కెట్ వద్ద బుధవారం రాత్రి పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.0 /16.8

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత తగ్గే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

స్వాతంత్య్ర వీరులకు ఘన నివాళి



నిజామాబాద్‌అర్బన్: దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన వీరులకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నేతృత్వంలో గురువారం సంస్మరణ దినాన్ని నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని స్వాతంత్య్రోద్యమ అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తామనే సంకల్పాన్ని చాటుతూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఆయా శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

2 నుంచి రైల్వే గేట్ మూసివేత

మాక్లూర్: మాక్లూర్ మండలం అడవిమామిడిపల్లి వద్ద ఉన్న రైల్వే గేట్‌ను ఫిబ్రవరి 2 నుంచి 8 వరకు మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు గురువారం తెలిపారు. రైల్వే క్రాసింగ్ గేటు వద్ద మేజర్ మరమ్మతులు చేపట్టనున్నామని, వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగించాలని సూచించారు.

జీజీహెచ్‌కు మంచి గుర్తింపు తేవాలి



నిజామాబాద్‌నాగారం: అధికారులు, సిబ్బంది, కార్మికులు కలిసి పనిచేస్తూ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి(జీజీహెచ్)కి మంచి గుర్తింపు తీసుకురావాలని సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. జీజీహెచ్ కాన్ఫరెన్స్ హాలులో గురువారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) జనరల్ బాడీ సమావేశాన్ని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, జీఎంసీ వైస్ ప్రిన్సిపాల్ జలగం తిరుపతి రావు హాజరయ్యారు. రోజురోజుకూ పెరుగుతున్న ఓపీ, ఐపీని దృష్టిలో పెట్టుకొని జీజీహెచ్‌ను ప్రభుత్వం వెయ్యి పడకలకు పెంచాలని నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన మినిమం వేజ్ బోర్డులో నూతనంగా ఎన్నికైన యూసఫ్‌ను కార్మికులు సన్మానించారు. సమావేశంలో యూనియన్ నాయకులు హైమది, భాగ్యలక్ష్మి, స్వరూప, కవిత, వెంకట్, వెంకటేశ్, రాధాకుమార్, రాజు, కార్మికులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు

- డ్రైవర్ మృతి, ఏడుగురికి గాయాలు



బోల్తా పడిన ఆటో



చిన్నయ్య (ఫైల్)

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ శివారులో జాతీయ రహదారిపై గురువారం ఆటోను వెనక నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ బోస్ల చిన్నయ్య (50) మృతి చెందగా ఏడుగురికి గాయాలు అయ్యాయి. వివరాలు.. ఆర్మూర్ నుంచి పడకల్ వెళ్తున్న ఆటోను అర్గుల్ శివారులో వెనక నుంచి కారు ఢీకొంది. ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందగా, ఆటోలోని అరుణ, విజయ, సునీత, రాజులకు తీవ్రగాయాలు అయ్యాయి. మరో ముగ్గురికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఎస్సై తిరుపతి సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు.



పోలీసులను చూసి రోడ్డు పక్కన ఆగిపోయిన వాహనదారులు

ఎక్కడి వారక్కడే..!

నిజామాబాద్ నగరంలోని బోర్గాం చౌరస్తా వద్ద పోలీసులు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. పోలీసులను దూరం నుంచే గమనించిన వాహనదారులు ఇలా ఎక్కడి వారక్కడే ఆగిపోయారు. ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోవడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఓవైపు పోలీసులు, మరో వైపు వాహనదారులు ఒకరికోసం మరొకరు ఎదురు చూస్తున్నట్లు ఉన్న ఈ దృశ్యాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



వాహనాల తనిఖీ కోసం నిలబడిన పోలీసులు

టీచర్లు 3,529.. పట్టభద్రులు 30,593



పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో తుది ఓటరు జాబితాను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు గురువారం విడుదల చేశారు. ఓటర్లలో మొత్తం 30,593 మంది పట్టభద్రులు ఉండగా, వారిలో పురుషులు 19,368 మంది, మహిళలు 11,225 మంది ఉన్నారు. అలాగే ఉపాధ్యాయ ఓటర్లు మొత్తం 3,529 మంది ఉండగా, వారిలో పురుషులు 2100, మహిళలు 1429 మంది ఉన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు తుదిజాబితా విడుదల

నిజామాబాద్‌అర్బన్: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో తుది ఓటరు జాబితాను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు గురువారం విడుదల చేశారు. నిజామాబాద్ – ఆదిలాబాద్ – కరీంనగర్ – మెదక్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గాల పరిధిలోని నిజామాబాద్ జిల్లాలో నమోదైన ఓటర్ల వివరాలను ప్రకటించారు. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదలకానుండగా, 27న ఎన్నికలు, మార్చి 3న కౌంటింగ్ నిర్వహించనున్నారు.

డివిజన్‌ల వారీగా ఓటర్ల వివరాలు

పట్టభద్రులు					
రెవెన్యూ డివిజన్	మండలాలు	పోలింగ్‌స్టేషన్లు	పురుషులు	మహిళలు	మొత్తం ఓటర్లు
నిజామాబాద్	10	21	8,532	5,354	13,886
బోధన్	10	11	3,226	1,692	4,918
ఆర్మూర్	13	16	7,610	4,179	11,789
మొత్తం	33	48	19,368	11,225	30,593
ఉపాధ్యాయులు					
రెవెన్యూ డివిజన్	మండలాలు	పోలింగ్‌స్టేషన్లు	పురుషులు	మహిళలు	మొత్తం ఓటర్లు
నిజామాబాద్	10	10	994	810	1,804
బోధన్	10	10	390	312	702
ఆర్మూర్	13	13	716	307	1,023
మొత్తం	33	33	2,100	1,429	3,529

కాంగ్రెస్ అభ్యర్థిగా నరేందర్‌రెడ్డి..!

- పట్టభద్రుల ఎమ్మెల్సీకి దాదాపు ఖరారు చేసిన పార్టీ నాయకత్వం
- రెండుమూడు రోజుల్లో వెలువడనున్న ప్రకటన
- ఇప్పటికే అభ్యర్థిని ప్రకటించిన బీజేపీ
- స్పష్టత లేని బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వం
- బీఆర్‌ఎస్ మద్దతు కోరిన గిరిధర్‌గౌడ్



అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఆదిలాబాద్–నిజామాబాద్–కరీంగనర్–మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థిగా కరీంనగర్‌కు చెందిన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డిని ఖరారు చేసినట్లు సమాచారం. ఈ నియోజకవర్గ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ రానుంది. అదే రోజు నుంచి నామినేషన్ల దాఖలు మొదలు కానుంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీతో పోలిస్తే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల సంఖ్య ఎక్కువ కావడంతో ఈ ఎన్నిక మీద ఆసక్తి ఎక్కువగా ఉంటోంది. ఇందుకు సంబంధించి రెండు జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్యే పోటీ ఉండనున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అయితే ఇప్పటికే బీజేపీ తన అభ్యర్థులను ప్రకటించింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సంగారెడ్డి జిల్లాకు చెందిన సీ అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పెద్దపల్లి జిల్లాకు చెందిన మల్క కొమరయ్యను ప్రకటించింది. కాగా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి అభ్యర్థిని పెట్టే విషయంలో ఆలోచన చేయడం లేదు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిపై ఒక స్పష్టతకు వచ్చినట్లు తెలుస్తోంది. రెండునెలల క్రితమే నాలుగు ఉమ్మడి జిల్లాల్లో ప్రచారం ప్రారంభించిన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి కాంగ్రెస్ మద్దతు కోసం గట్టి ప్రయత్నాలు చేస్తూ వస్తున్నారు. ఈ నెల 29న పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మరో ఇద్దరు మంత్రులు కలిసి ఈ విషయమై సుదీర్ఘ చర్చ జరిపారు. నరేందర్‌రెడ్డి పేరును దాదాపు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. రెండుమూడు రోజుల్లో నరేందర్‌రెడ్డి పేరును ప్రకటించేందుకు కాంగ్రెస్ నాయకత్వం కసరత్తు చేస్తోంది. ఇదిలా ఉండగా బీఆర్‌ఎస్ నుంచి అభ్యర్థిని బరిలోకి దించే విషయంలో ఇప్పటివరకు స్పష్టత లేదు. బీఆర్‌ఎస్ తన అభ్యర్థిని బరిలోకి దించేది అనుమానమే అని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీంతో స్వతంత్రంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న సంగారెడ్డి జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ మాచర్ల గిరిధర్‌గౌడ్ బీఆర్‌ఎస్ నుంచి పరోక్ష మద్దతు కోరుతున్నారు.

పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లోకి చిరుత

- కుక్క పిల్లను ఎత్తుకెళ్లిన వైనం
- అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఫారెస్ట్ అధికారుల సూచన



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలం జానకంపేట శివారులో ఉన్న పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ఆవరణలోకి బుధవారం రాత్రి చిరుత వచ్చి కుక్క పిల్లను ఎత్తుకెళ్లింది. చిరుతను చూసిన హోంగార్డు అక్కడి సిబ్బందిని అప్రమత్తం చేసేలోగా అది అటవీప్రాంతంలోకి పారిపోయింది. ట్రైనింగ్ సెంటర్ సీఐ శివరాం జిల్లా అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించగా ఫారెస్ట్ రేంజ్ అధికారి సంజయ్‌గౌడ్‌తోపాటు పది మంది అటవీ శాఖ సిబ్బంది గురువారం పోలీస్ ట్రైనింగ్ సెంటర్ పరిసరాలను పరిశీలించి పాదముద్రల ఆనవాళ్లను సేకరించారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్‌వో మాట్లాడుతూ.. చిరుత సంచారం నిజమేనని అన్నారు. రాత్రి వేళలో చిరుత సంచరిస్తుంటుందని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. తాణాకలాన్ – జానకంపేట్, తాణాకలాన్ – బాపూనగర్, జానకంపేట్ – దూపల్లిగేట్ రోడ్లపై రాకపోకలు సాగించే ద్విచక్ర వాహన దారులు ఒంటరిగా ప్రయాణించొద్దన్నారు. చిరుత కనిపిస్తే దగ్గరికి వెళ్లకుండా ఆగిపోవాలని, గట్టిగా శబ్దం చేస్తే చిరుత వెళ్లిపోతుందని సూచించారు.

అనర్హులకు ఆత్మీయ భరోసా!

- గ్రామసభల్లో వెల్లడైన పేర్లు
- జిల్లాలో ఇప్పటికే 3వేల మంది పేర్లు బహిర్గతం

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్ మండలంలోని వడ్యాట్‌లో ఓ విద్యార్థికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం మంజూరైనట్లు గ్రామసభ ద్వారా వెల్లడైంది. అలాగే ఆర్థికంగా స్థిరపడిన కుటుంబంలోని యువకుడికీ ఆత్మీయ భరోసా మంజూరైనట్లు జాబితాలో అధికారులు వెల్లడించడంతో తీవ్ర నిరసన వ్యక్తమైంది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమిలేని వ్యవసాయ కూలీలకు సాయం అందించాల్సి ఉండగా ఆర్థికంగా ఉన్నవారి పేర్లు జాబితాల్లో కనిపించడం గందరగోళానికి దారి తీసింది. ఇది ఒక్క వడ్యాట్‌లోనే చోటు చేసుకున్న ఘటన కాదు. జిల్లాలో అనేక చోట్ల ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల జాబితాలో అనర్హుల పేర్లు నమోదు కావడంతో పథకం పక్కదారి పడుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఆర్థికంగా చేయూతను అందించేందుకు నిర్దేశించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అనర్హులకు అందిస్తే ప్రభుత్వ ఉద్దేశం నీరుగారుతుందనే వాదన వినిపిస్తోంది. జిల్లాలో 42 వేల మందిని ఆత్మీయ భరోసా పథకం కింద ఎంపిక చేయగా నాలుగు రోజులపాటు నిర్వహించిన గ్రామ సభల్లో 3 వేల మంది అనర్హులు ఉన్నట్లు తేలింది. జిల్లాలో 530 (కొత్తవి కాకుండా) గ్రామ పంచాయతీల పరిధిలో 2023లో చేపట్టిన ఉపాధి పనుల్లో కనీసం 20 రోజులపాటు హాజరైన కుటుంబాలను పరిగణనలోకి తీసుకుని ఆత్మీయ భరోసా లబ్ధిదారుల జాబితాను రూపొందించారు. అప్పట్లో 85 వేల కుటుంబాలు ఉపాధి పనుల్లో పాల్గొన్నాయి. ఉపాధి కూలీల కుటుంబాల జాబ్‌కార్డులను ధరణి వెబ్‌పోర్టల్‌తో అనుసంధానం చేసి 42వేల మందికి భూమి లేదని గుర్తించారు. ధరణి వెబ్‌పోర్టల్, జాబ్‌కార్డుల అనుసంధానంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో భూమి ఉన్నవారికి కూడా ఆత్మీయ భరోసా మంజూరైనట్లు జాబితాల్లో బహిర్గతమైంది.

అర్హులకే అందిస్తాం

ఎంపీడీవోల ద్వారా మరోసారి అనర్హులను ఏరివేసే ప్రక్రియ నిర్వహిస్తాం. గ్రామ సభల్లో జాబితాలను బహిర్గతం చేయడం ద్వారా అర్హులు, అనర్హులను గుర్తిస్తున్నాం. ఆత్మీయ భరోసా పథకాన్ని వంద శాతం అర్హులకే వర్తింపజేస్తాం.

– సాయాగౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి

వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరా



ఎస్‌ఈ రవీందర్, డీఈ ఉత్తమ్ జాడేను సన్మానిస్తున్న మిట్టాపల్లి వీడీసీ సభ్యులు

డిచ్‌పల్లి: వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ ఆర్ రవీందర్ తెలిపారు. డిచ్‌పల్లి మండలంలోని మిట్టాపల్లి 33/11 సబ్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫీడర్ బ్రేకర్స్‌ను ఎస్‌ఈ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో మూడు గ్రామాలకు కలిపి ఒకే ఫీడర్ ఉండటంతో ఏదైనా సమస్య వచ్చినప్పుడు అన్నింటికీ విద్యుత్ సరఫరా నిలిపి వేయాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం సుమారు రూ.15 లక్షలతో ఫీడర్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో సమస్య వచ్చిన ఫీడర్‌కు మాత్రమే సరఫరా నిలిపి వేసి మిగిలిన ఫీడర్‌లకు యథావిధిగా విద్యుత్ సరఫరా కొనసాగించవచ్చన్నారు. కార్యక్రమంలో డీఈ ఉత్తమ్ జాడే, డీఈ (టెక్నికల్) జే రమేశ్, ఏఈడీ జీ శ్రీనివాస్, ఏఈ గంగారాం, ఎస్‌ఎల్‌ఐ అబ్బయ్య, లైన్‌మన్ మహేశ్‌కుమార్, ఏఎల్‌ఎం అనిల్‌కుమార్, ఆపరేటర్ వినయ్, వీడీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. వీడీసీ ఆధ్వర్యంలో ఎస్‌ఈ, డీఈలను ఘనంగా సన్మానించారు.

రాష్ట్రంలో భయంకర రోజులు

- ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తోంది
- ఏసీ గదుల్లో కూర్చొని లబ్ధిదారుల జాబితాను రూపొందించారు
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శ



రామడుగులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

ధర్పల్లి: కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో భయంకర రోజులు వచ్చాయని, అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ధర్పల్లి మండలంలోని రామడుగులో గురువారం ఆమె మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలన కారణంగా తెలంగాణ వందేళ్ల వెనక్కి వెళ్లే దుస్థితి వచ్చిందన్నారు.

అబద్ధపు హామీలతో సీఎం రేవంత్‌రెడ్డి కాలం వెళ్లదీస్తున్నారని, ఆర్థిక పరిస్థితి తెలిసీతెలియక హామీలు ఇచ్చామని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ తెలంగాణ పరిస్థితులపై ఎందుకు మాట్లాడడం లేదని ఆమె ప్రశ్నించారు. సచివాలయంలోని ఏసీ గదుల్లో కూర్చొని లబ్ధిదారుల జాబితా తయారు చేయడంతో ప్రజలు ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారన్నారు. యూరియా కోసం రైతులు మళ్లీ లైన్లు కట్టే పరిస్థితి వచ్చిందని, కరెంటు ఎప్పుడొస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని దుస్థితి నెలకొన్నదన్నారు. అర్హులందరికీ కేసీఆర్ పారదర్శకంగా పథకాలను అందించారని, బీఆర్‌ఎస్ హయాంలో మంజూరు చేసిన పనులను తాము చేశామని కాంగ్రెస్ చెప్పుకోవడం తప్ప ఏమీ లేదన్నారు. కాళేశ్వరం ప్యాకేజీ – 21 పనులను పూర్తి చేయలేని చేతగాని ప్రభుత్వంగా కాంగ్రెస్ నిలిచిందని విమర్శించారు. పసుపు పంటకు కనీస మద్దతు ధర ప్రకటించేలా ఎంపీ ధర్మపురి అర్వింద్ కృషి చేయాలని సూచించారు.

కుంభమేళాలో తెలంగాణ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి

ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో తెలంగాణ ప్రభుత్వం హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సూచించారు. కుంభమేళా తొక్కిసలాటలో 30 మంది మృతి చెందడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం



గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న బిగాల గణేశ్‌గుప్తా, నాయకులు

నిజామాబాద్‌అర్బన్: ఎన్నికల హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా గాంధీ చౌక్‌లోని గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ మోసాలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిగాల మాట్లాడుతూ.. డిక్లరేషన్, గ్యారెంటీల పేరుతో 420 బూటకపు హామీలను కాంగ్రెస్ ఇచ్చిందని విమర్శించారు. వంద రోజుల్లో హామీలను అమలుచేస్తామని ప్రకటించారని, 420 రోజులు అవుతున్నా అమలు చేయడం లేదన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, మేనిఫెస్టోలో పెట్టకపోయినా తమ ప్రభుత్వ హయాంలో ఒక్కో వ్యక్తికి ఇచ్చే రేషన్ బియ్యాన్ని నాలుగు నుంచి ఆరు కేజీలకు పెంచామన్నారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో 6,47,479 నూతన రేషన్‌కార్డులు ఇచ్చామని, 2 లక్షల ఉద్యోగాలు కల్పించామని వివరించారు. నిరసన కార్యక్రమంలో నగర మాజీ మేయర్ దండు నీతూకిరణ్, నుడా మాజీ చైర్మన్ చామకూర ప్రభాకర్‌రెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు సిర్ప రాజు, సత్యప్రకాశ్, దండు శేఖర్, నవీద్ ఇక్బాల్, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీఈడీ పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ మూడో సెమిస్టర్‌ (రెగ్యులర్‌) పరీక్ష ఫీజు ఫిబ్రవరి 8వరకు చెల్లించాలని కంట్రోలర్‌ ఎం అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో ఫిబ్రవరి 10 వరకు చెల్లించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

తెల్లజొన్న కోతలు షురూ



బాల్కొండ: తెల్లజొన్న పంట చేతికి రావడంతో రైతులు కోతలను ప్రారంభించారు. నియోజకవర్గంలో మోర్తాడ్‌, బాల్కొండ, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల మండలాల్లో ఎర్రజొన్నతో పాటు తెల్లజొన్నను అధికంగా సాగు చేస్తారు. ప్రస్తుతం పంటను కోసి రోడ్లపై ఆరబోస్తున్నారు.

గద్దర్‌ జయంతిని జయప్రదం చేయాలి



నిజామాబాద్‌ నాగారం: ప్రముఖ కవి, రచయిత గద్దర్‌ జయంతిని శుక్రవారం నగరంలోని నాందేవాడలో ఉన్న మల్లు స్వరాజ్యం మీటింగ్‌ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు గద్దర్‌ ఫౌండేషన్‌ అధ్యక్షుడు గైని గంగారాం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజవయంతం చేయాలని కోరారు. ఎం బాబురాం, చిట్టి మల్ల హరి ప్రసాద్‌, రామ్‌మోహన్‌ రావు, ఎస్కే హుస్సేన్‌, సక్కి విజయ్‌కుమార్‌, భాస్కర్‌, బంగారు సాయిలు, జాఫర్‌, లక్ష్మణ్‌, ప్రభంజన్‌, షేక్‌ నజీర్‌, డాక్టర్‌ సజ్జర్‌ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన



నిజామాబాద్‌ నాగారం: నగరంలోని దుబ్బ పీహెచ్‌సీలో లెప్రసీ జిల్లా అధికారి భార్గవి ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నివారణపై గురువారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. జిల్లా కేంద్రంలోని జనరల్‌ ఆస్పత్రిలోనూ కుష్టు వ్యాధిపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్‌ ఆఫీసర్‌ శ్రీలత, చంద్రకళ, ప్రోగ్రాం ఆఫీసర్‌ రూప పాల్గొన్నారు.

పెండింగ్‌ కేసులను వెంటనే పరిష్కరించాలి

కామారెడ్డి క్రైం: ఆయా పోలీస్‌స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలని ఎస్పీ సింధు శర్మ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్షలో మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలు, జూదం, మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. పెట్రోలింగ్‌ మరింత పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాధాన్యతపై ప్రజలకు వివరించాలన్నారు. వీలైనన్ని ఎక్కువ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కామారెడ్డి ఏఎస్పీ చైతన్యారెడ్డి, అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాలు అందక అవస్థలు

- సమగ్ర శిక్ష ఉద్యోగులకు రెండు నెలలుగా అందని జీతం
- సమ్మె కాలంలో వేతనాల చెల్లింపుపై స్పష్టత కరువు



వేతనాల కోసం డీఈవోను కలిసిన సమగ్ర శిక్ష జేఏసీ నాయకులు (ఫైల్‌)

ఆర్మూర్‌: సమగ్ర శిక్ష ఉద్యోగులు రెండు నెలలుగా వేతనాలు అందక ఇక్కట్లు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 29 రోజుల పాటు సమ్మె నిర్వహించారు. ఈ సమ్మెలో నిజామాబాద్‌, కామారెడ్డి జిల్లాల ఉద్యోగులు సైతం పాల్గొన్నారు. సమగ్ర శిక్ష రాష్ట్ర జేఏసీ నాయకత్వంలో కొందరు చేసిన తప్పిదం కారణంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకున్నప్పటికీ సమ్మెను విరమించారు. అయితే సమ్మె విరమించే సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేదు కాబట్టి కాంట్రాక్టు ఉద్యోగులకు పే స్కేల్‌ వర్తింప జేయాలి అనే డిమాండ్‌ను పక్కన పెట్టి నాన్‌ ఫైనాన్షియల్‌ డిమాండ్లన్నింటిని పరిష్కరిస్తూ సమ్మె కాలానికి వేతనం సైతం చెల్లిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చారంటూ జేఏసీ నాయకత్వం సమ్మెను విరమింపజేసింది. డిసెంబర్‌ 7వ తేదీ నుంచి నిరసన దీక్షలు ప్రారంభించిన ఉద్యోగులు పదో తేదీ నుంచి పూర్తి స్థాయిలో విధులను బహిష్కరిస్తూ సమ్మె బాట పట్టారు. అయితే సమ్మె కారణంగా డిసెంబర్‌ నెల వేతనం పొందలేకపోయారు. జనవరి 6వ తేదీ నుంచి విధుల్లో చేరినప్పటికీ జనవరి నెల వేతనం సైతం అందే పరిస్థితులు లేవు. సమగ్ర శిక్ష జేఏసీ నాయకులు ఎప్పటికప్పుడు రాష్ట్ర స్థాయి అధికారులను కలుస్తూ సమ్మె డిమాండ్ల సాధనతో పాటు సమ్మె కాలంలో వేతనం చెల్లింపుకు ఉత్తర్వులు జారీ చేయాలని విన్నవిస్తున్నా అధికారుల్లో కదలిక లేకపోవడంతో ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో సమగ్ర శిక్ష ఉద్యోగుల వివరాలు

విభాగం	నిజామాబాద్‌	కామారెడ్డి
కేజీబీవీ బోధనేతర, బోధన సిబ్బంది	571	480
యూఆర్‌ఎస్‌, బోధనేతర సిబ్బంది	10	10
డీపీవో సిబ్బంది	9	7
ఎంఐఎస్‌ సమన్వయకర్తలు	22	22
సీసీవోలు	29	22
సీఆర్పీలు	94	76
ఐఈఆర్పీలు	35	26
మెసెంజర్లు	19	18
పీటీఐలు	88	71
సీజీవీలు	19	18
మొత్తం	896	750

వేతనాలు చెల్లించాలి



చాలీచాలని వేతనాలతో ఇక్కట్లు పడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు సమ్మె కాలం వేతనాలు చెల్లిస్తామన్న అధికారులు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయాలి. ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమ్మె చేశారు అనే భావన సరైంది కాదు. న్యాయమైన మా డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి సమ్మె చేశాం.

– రాజు, సమగ్ర శిక్ష జేఏసీ అధ్యక్షుడు, నిజామాబాద్‌

ప్రతిసారి మోసపోతూనే ఉన్నాం



ఎన్నికలకు ముందు, తరువాత రాజకీయ నాయకులు, పాలకుల హామీలను నమ్మి ప్రతి సారి మోసపోతూనే ఉన్నాం. సమగ్ర శిక్ష ఉద్యోగులకు సమ్మె కాలం వేతనాలతో పాటు పే స్కేల్‌ ఇచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– ప్రకాశ్‌, సమగ్ర శిక్ష జేఏసీ నాయకుడు, నిజామాబాద్‌

మళ్లీ మొదలైన వ్యభిచారం!

- నందిపేట కేంద్రంగా నిర్వహిస్తున్న వైనం
- 33 ఏళ్ల కిందట తరిమికొట్టిన గ్రామస్తులు

నందిపేట్‌: దశాబ్దాల క్రితం నందిపేటలో కొనసాగుతున్న వ్యభిచార గృహాలపై గ్రామస్తులంతా మూకుమ్మడిగా దాడులు జరిపి పారదోలారు. 33 ఏళ్ల తర్వాత మళ్లీ వ్యభిచార కూపాలు వెలుగు చూస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం

నందిపేటలో కొనసాగుతున్న వ్యభిచార కూపాలపై 1992లో గ్రామస్తులంతా దాడులు చేసి నిర్వాహకులను పారదోలారు. ఈ ఘటన అప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. 1992లో 13 ఏళ్ల బాలికను చిత్రహింసలు పెడుతూ వ్యభిచార రొంపిలోకి దింపడానికి ప్రయత్నించగా ఆమె తప్పించుకుని ప్రజలను రక్షించాలని వేడుకుంది. ఈ విషయం చిలికి చిలికి గాలివానలా గ్రామమంతా వ్యాపించింది. ఈ వార్తను పత్రికలు ప్రచురించాయి. దీంతో గ్రామపెద్దలు, యువకులు అందరూ కలిసి ఊరేగింపుగా వెళ్లి వ్యభిచార గృహాలపై దాడులు చేశారు. వారి ఇళ్లను తగులబెట్టి, నిర్వాహకులను తరిమి కొట్టారు. ఈ కూపంలో ఇరుక్కున్న అమ్మాయిలకు విముక్తి కల్పించారు. ఈ దాడుల్లో విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. అండర్‌ గ్రౌండ్‌ గదుల్లో అమ్మాయిలను బంధించి వ్యభిచార కూపంలోకి దించేందుకు చిత్రహింసలు పెట్టేవారని, వినకపోతే చంపడానికి కూడా వెనుకాడబోయే వారు కాదనే వార్తలు వెలుగు చూశాయి.

దాడులు చేసిన పోలీసులు

గ్రామస్తుల కృషితో అంతమైన వ్యభిచార వృత్తి మళ్లీ మొదలైంది. వ్యభిచార గృహాల నిర్వాహకులు కొన్ని సంవత్సరాల తర్వాత తిరిగి వచ్చి కూలీ పను లు చేసుకుని బతుకుతామని నందిపేట సమీపంలోని లక్కంపల్లి ప్రాంతంలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఈ నివాసాలు మళ్లీ వ్యభిచార కేంద్రాలుగా మారాయి. అమ్మాయిలను ఎక్కడి నుంచో తీసుకువచ్చి బలవంతంగా ఈ రొంపిలోకి దింపుతున్నారు. ఐదు రోజుల క్రితం పోలీసులు దాడులు చేసి వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరు మహిళలతో పాటు నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు.

భారీగా తగ్గిన ఎస్సారెస్పీ నీటిమట్టం



ఎస్సారెస్పీ ప్రస్తుత నీటి మట్టం

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నీటి మట్టం భారీగా తగ్గిపోయింది. గడిచిన 35 రోజుల వ్యవధిలో 31 టీఎంసీల నీరు ఖాళీ అయింది. యాసంగి సీజన్‌లో ఆయకట్టుకు గత నెల 25 నుంచి నీటి విడుదల చేపట్టారు. ఆయకట్టుతో పాటు వరద కాలువ ద్వారా మిడ్‌ మానేరుకు పది టీఎంసీలు తరలించారు. దీంతో ప్రాజెక్ట్‌ నీటి మట్టం వేగంగా తగ్గుతోంది. ప్రస్తుత సంవత్సరం నీటి వినియోగం ఎక్కువగా జరుగుతుండటంపై ప్రాజెక్ట్‌ అధికారులే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలంలో నీటి వినియోగం మరింత పెరుగుతుంది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌ నుంచి కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుంది. కాకతీయ కాలువ ద్వారా 1500 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 3 వేలు, సరస్వతి కాలువ ద్వారా 700, లక్ష్మికాలువ ద్వారా 250 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా 270 క్యూసెక్కులు, అలీసాగర్‌ లిఫ్ట్‌ ద్వారా 397 క్యూసెక్కులు, ముంపు గ్రామాల లిఫ్టుల ద్వారా 312 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 1081.60(49.5 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్‌ అధికారులు తెలిపారు.

కొడుకును చంపిన తల్లికి పదేళ్ల జైలు

ఖలీల్‌వాడి : కన్న కొడుకును హత్య చేసిన మహిళకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్‌ రెండో అదనపు జిల్లా సెషన్స్‌ కోర్టు న్యాయమూర్తి టి శ్రీనివాస్‌ గురువారం తీర్పు ఇచ్చారు. వివరాలు.. నగరంలోని సంతోష్‌నగర్‌కు చెందిన గడ్డం భరత్‌కు సదాశివనగర్‌ మండలం తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన లావణ్యతో వివాహం అయింది. లావణ్యకు కల్లు తాగే అలవాటు ఉండేది. అలవాటు మానుకోవాలని భర్త ఎన్నోసార్లు హెచ్చరించాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగేది. ఈ క్రమంలో భర్తపై కసి పెంచుకుంది. ఓ రోజు నిద్రపోతున్న భరత్‌పై బ్లేడ్‌తో దాడి చేసింది. భర్తపై కోపంతో 2023 మార్చి 29న తన ఆరేళ్ల కుమారుడిని కాలువలో ముంచి హత్య చేసింది. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితురాలికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా నెల రోజుల జైలుశిక్ష అనుభవించాలని పేర్కొన్నారు.

కార్మికురాలిని ఢీకొట్టిన ఆటో డ్రైవర్‌కు..

ఖలీల్‌వాడి : మున్సిపల్‌ కార్మికురాలిని ఢీకొట్టిన ఆటో డ్రైవర్‌కు రెండు రోజుల జైలు శిక్ష పడినట్లు నాలుగో టౌన్‌ ఎస్సై ఉదయ్‌ కుమార్‌ గురువారం తెలిపారు. నగరంలోని బ్యాంక్‌ కాలనీలో మున్సిపల్‌ కార్మికురాలు నిమ్మరాజు సాయమ్మ విధులు నిర్వహిస్తుండగా ఆటోనగర్‌కు చెందిన అబ్దుల్‌ మాజిద్‌ మద్యం మత్తులో ఆటోతో ఆమెను ఢీకొన్నాడు. దీంతో ఆమెకు గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్‌ నిందితుడికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

అన్న మరణం తట్టుకోలేక ఆగిన తమ్ముడి గుండె



అంజల్‌రెడ్డి(ఫైల్‌)

మాచారెడ్డి: అన్న మరణాన్ని తట్టుకోలేక గుండెపోటుతో తమ్ముడు మృతి చెందాడు. ఈ ఘటన మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మల్కాపురం నరసింహారెడ్డి(75) అనారోగ్యానికి గురై మూడు రోజుల క్రితం మృతి చెందాడు. నర్సింహారెడ్డి మరణాన్ని తట్టుకోలేక ఆయన తమ్ముడు అంజల్‌ రెడ్డి(65) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు.

ఏపీఎం వేధిస్తున్నాడని వీవోఏల ఫిర్యాదు

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): ఏర్గట్ల మండల ఏపీఎం శ్యామ్‌ తమను వేధింపులకు గురి చేస్తున్నాడని ఆరోపిస్తూ అదే మండలానికి చెందిన మహిళా వీవోఏలు మండల సమాఖ్య అధ్యక్షురాలితో కలిసి డీఆర్‌డీవో సాయాగౌడ్‌కు ఫిర్యాదు చేశారు. తరచుగా ఫోన్లు, వీడియో కాల్స్‌ చేస్తూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని వీవోఏలు డీఆర్‌డీవో ముందు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన డీఆర్‌డీవో డీపీఎంలు సంధ్యారాణి, మారుతిలను ఏర్గట్ల మండలానికి వెళ్లి విచారణ చేయాలని ఆదేశించారు. గురువారం విచారణకు వెళ్లిన డీపీఎంలు ఏం జరిగిందో ఆరా తీశారు. గతంలో మెండోరా మండల ఏపీఎంగా పని చేసిన సమయంలో కూడా శ్యామ్‌పై ఇలాంటి ఆరోపణలు రాగా, ఆయన్ను సస్పెండ్‌ చేశారు. మళ్లీ ఏర్గట్ల మండల ఏపీఎంగా పోస్టింగ్‌ తీసుకుని ఇక్కడ కూడా అలాంటి ఆరోపణలు రావడం ఆయన పని తీరుపై విమర్శలు వస్తున్నాయి. విచారణ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీవో సాయాగౌడ్‌ 'సాక్షి'తో తెలిపారు. కాగా ఏపీఎంను ఈ వ్యవహారంలో నుంచి బయట పడేసేందుకు యూనియన్‌ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

క్రైం కార్నర్‌

లారీ ఢీకొని బెటాలియన్‌ హెడ్‌ కానిస్టేబుల్‌ మృతి



కల్యాణ్‌కుమార్‌(ఫైల్‌)

డిచ్‌పల్లి: లారీ ఢీకొనడంతో బెటాలియన్‌ హెడ్‌ కానిస్టేబుల్‌ మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి మాధవనగర్‌ బైపాస్‌ రోడ్డులో చోటు చేసుకుంది. నిజామాబాద్‌ రూరల్‌ ఎస్సై ఎండీ ఆరీఫ్‌, బెటాలియన్‌ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన అజ్మీరా కల్యాణ్‌కుమార్‌ (29) డిచ్‌పల్లిలోని బెటాలియన్‌లో 2018 నుంచి హెడ్‌ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ప్రస్తుతం నిజామాబాద్‌లో ఉంటూ రోజూ విధి నిర్వహణ కోసం బెటాలియన్‌కు రాకపోకలు సాగిస్తున్నారు. ఎప్పటిలాగే బుధవారం రాత్రి తన బైక్‌పై నిజామాబాద్‌ నుంచి డిచ్‌పల్లిలోని బెటాలియన్‌కు బయలుదేరాడు. మాధవనగర్‌ బైపాస్‌ రోడ్డులో వెళ్తుండగా వెనక నుంచి వేగంగా వచ్చిన లారీ బైక్‌ను ఢీకొట్టడంతో కల్యాణ్‌కుమార్‌ తలకు తీవ్రంగా గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సుష్మ, మూడు సంవత్సరాల పాప, రెండు నెలల బాబు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆరీఫ్‌ తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

హెడ్‌ కానిస్టేబుల్‌ కల్యాణ్‌కుమార్‌ కుటుంబానికి అండగా ఉండి అన్ని విధాల ఆదుకుంటామని బెటాలియన్‌ కమాండెంట్‌ సత్యనారాయణ తెలిపారు. గురువారం పోస్టుమార్టం అనంతరం కల్యాణ్‌కుమార్‌ మృతదేహాన్ని అంబులెన్స్‌లో బెటాలియన్‌ కు తీసుకువచ్చారు. ఆయన పార్థివ దేహానికి బెటాలియన్‌ అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు.

గంజాయి పట్టివేత



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌ చౌరస్తాలో గురువారం మధ్యాహ్నం గంజాయి పట్టుకున్నట్లు ఆర్మూర్‌ ఎక్సైజ్‌ సీఐ స్టీవెన్సన్‌ తెలిపారు. పక్కా సమాచారంతో దాడులు చేసి గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరిని అరెస్ట్‌ చేశామన్నారు. ఆదిలాబాద్‌ జిల్లా నేరేడుగొండ మండలం లింగట్ల గ్రామానికి చెందిన రంజిత్‌సింగ్‌, బరదవత్‌ గవాస్కర్‌ బైక్‌పై ఎండు గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. వారి నుంచి 1.3 కేజీల గంజాయి, పల్సర్‌ బైక్‌ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. తనిఖీల్లో ఎస్సై చంద్రమౌళి, సిబ్బంది సాయిలు, వికాస్‌గౌడ్‌, సందీప్‌, నరేష్‌, శ్రీనివాస్‌, సాగర్‌ పాల్గొన్నారు.

టేకు దుంగలు..



సిరికొండ : సిరికొండ అటవీ రేంజ్‌ పరిధిలోని చీమన్‌పల్లి, జనిగ్యాల గ్రామాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 74 టేకు దుంగలను పట్టుకున్నట్లు ఎఫ్‌ఆర్‌వో రవీందర్‌ గురువారం తెలిపారు. జనిగ్యాల గ్రామంలో బన్నీ నాయక్‌ చీమనుపల్లి గ్రామంలో వడ్రంగి నరేష్‌, మాలావత్‌ విజయ ఇళ్ల సమీపంలో టేకు కర్రలు పట్టుబడినట్లు ఆయన తెలిపారు. వీటి విలువ రూ.78 వేల వరకు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి దుంగలను సిరికొండలోని రేంజ్‌ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

ఉపాధి కోసం వెళ్లి ఇద్దరి అదృశ్యం



నీలి నరేశ్‌ ,చల్ల మహేందర్‌

ఎడపల్లి(బోధన్‌): ఎడపల్లి మండలం ఏఆర్పీ క్యాంప్‌ గ్రామానికి చెందిన ఇద్దరు అదృశ్యమయ్యారు. గ్రామానికి చెందిన చల్లా మహేందర్‌, నీలి నరేశ్‌ నెల రోజుల క్రితం కూలీ పనులు చేసుకోవడానికి జార్ఖండ్‌ రాష్ట్రానికి వెళ్లారు. వారం క్రితం తిరిగి ఇంటికి వస్తున్నట్లు కుటుంబ సభ్యులకు ఫోన్‌ చేసి చెప్పారు. ఇప్పటి వరకు ఇంటికి రాలేదు. ఫోన్‌లు స్విచ్‌ ఆఫ్‌ ఉండటంతో వారి కుటుంబ సభ్యులు గురువారం ఎడపల్లి పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బెల్టు షాపుపై దాడి

లింగంపేట: లింగంపేటలోని అంబేడ్కర్‌ చౌరస్తా ప్రాంతంలో సోమాగౌడ్‌ నిర్వహిస్తున్న బెల్టు షాపుపై ఎక్సైజ్‌ సీఐ షాకిర్‌ గురువారం దాడి చేశారు. సోమాగౌడ్‌ను బైండోవర్‌ చేశామన్నారు.

వేర్వేరు కారణాలతో పలువురి మృతి

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మండలం గోవింద్‌పేట్‌ గ్రామంలో మిర్యాల పోసాని (50) అలియాజ్‌ స్వప్న అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. వర్ని మండలం ఉమ్మనాపూర్‌ గ్రామానికి చెందిన రాజారాం, మిర్యాల పోసాని కుటుంబ 25 ఏళ్ల క్రితం ఉపాధి కోసం ఆర్మూర్‌ పట్టణానికి వలస వచ్చారు. రాజారాం 12 ఏళ్ల క్రితం మృతి చెందాడు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాగా స్వప్న ఐదేళ్లుగా మహబూబ్‌ అనే వ్యక్తితో గోవింద్‌పేట్‌ గ్రామంలో సహజీవనం చేస్తోంది. ఇద్దరు కలిసి కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఐదు రోజుల నుంచి వీరు ఉంటున్న ఇంటికి తాళం ఉంది. కాగా బుధవారం ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. గురువారం పోలీసులు క్లూస్‌టీంతో కలిసి ఇంట్లోకి వెళ్లగా కుళ్లిపోయిన స్థితిలో స్వప్న మృతదేహం కనిపించింది. వైద్యులు అక్కడే పోస్టుమార్టం నిర్వహించి, గోవింద్‌పేట్‌ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌ తెలిపారు.

నగరంలో వృద్ధుడు..

ఖలీల్‌వాడి: నగరంలోని సీతారాంనగర్‌ కు చెందిన అవుసుల అంజయ్య(60) మృతి చెందినట్లు ఐదో టౌన్‌ ఎస్సై లక్ష్మయ్య గురువారం తెలిపారు. అంజయ్యకు కొన్ని రోజుల నుంచి మతిస్థిమితం లేదన్నారు. 15 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదన్నారు. గురువారం మృతి చెందారని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కామారెడ్డిలో గుర్తు తెలియని మహిళ..

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పట్టణంలోని ఇందిరా చౌక్‌ వద్ద ఓ గుర్తు తెలియని మహిళ గురువారం మృతి చెందింది. 50–55 ఏళ్ల వయస్సు గల ఆమె గత కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. గద్దెపై పడుకున్న చోటనే ఆమె మృతి చెందగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు.

చికిత్స పొందుతూ..



రజిత(ఫైల్‌)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని సజ్జన్‌పల్లి గ్రామానికి చెందిన రజిత (39) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఏఎస్సై ప్రకాశ్‌ తెలిపారు. వివరాలు.. ఈ నెల 25న ముగురి శ్రీనివాస్‌ తన భార్య రజితతో కలిసి బైక్‌పై లింగంపేట నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా మరో బైక్‌ ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రజితను మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఏఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



కామారెడ్డి క్రైం: దైవ దర్శనానికని వెళ్లిన ఓ కుటుంబం తిరిగి వచ్చేసరికి ఇంట్లో దొంగలు పడిన ఘటన జిల్లా కేంద్రంలోని జయశంకర్‌ కాలనీలో గురువారం వెలుగుచూసింది. కాలనీకి చెందిన రాజశేఖర్‌ రెడ్డి కుటుంబం బుధవారం మాఘ అమావాస్య కావడంతో పుణ్యస్నానం చేయడానికని ఇంటికి తాళం వేసి కూడెల్లి వాగుకు వెళ్లారు. గురువారం ఇంటికి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దొంగలు చొరబడి సామాన్లన్నీ చిందరవందర చేసినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. ఇంట్లో దాచి ఉంచిన రూ.30 వేలు నగదు, 3 తులాల బంగారం, 10 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితులు చెబుతున్నారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి



లేగదూడ కళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని లింగంపల్లి(ఖుర్దు) గ్రామం శివారులోని అటవీ ప్రాంతంలో బుధవారం రాత్రి పంట చేను వద్ద కట్టేసిన లేగదూడపై చిరుత దాడి చేసి హతమార్చినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నాగారం రోడ్డులో పెద్దవాగు పక్కన చౌడం స్వామి తన పంట చేను వద్ద లేగదూడను కట్టేశాడు. అటవీ ప్రాంతం నుంచి వచ్చిన చిరుత రాత్రివేళ లేగదూడను చంపేసినట్లు బాధితుడు తెలిపారు. అటవీ శాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు.

బైక్‌ దొంగల అరెస్ట్‌

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఇద్దరు బైక్‌ దొంగలను అరెస్ట్‌ చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. ఈ నెల 28న కంఠేశ్వర్‌ చౌరస్తా వద్ద బైక్‌ చోరీ చేసిన చంద్రశేఖర్‌ కాలనీకి చెందిన ముజహీద్‌, మాజీద్‌ను అరెస్ట్‌ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

గాంధారి: మండలంలోని పోతంగల్‌ కలాన్‌ సమీపంలో బుగ్గగండి వద్ద గురువారం బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైనట్లు 108 ఈఎంటీ సురేష్‌ తెలిపారు. చాకలి కవిత, సందీప్‌ తిప్పారం నుంచి బాన్సువాడ మండలం కోనాపూర్‌కు బైక్‌పై వెళ్తుండగా బుగ్గగండి వద్ద కారు ఢీకొంది. దీంతో ఇద్దరు కింద పడిపోగా గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏ రియా ఆసుపత్రికి తరలించినట్లు ఈఎంటీ సురేష్‌, పైలట్‌ నరేష్‌ తెలిపారు.

ఆటో ఢీకొని హెడ్‌ కానిస్టేబుల్‌కు గాయాలు

ఖలీల్‌వాడి: ఆటో ఢీకొనడంతో హెడ్‌ కానిస్టేబుల్‌ గాయాలైన ఘటన నగరంలో చోటు చేసుకుంది. జీజీహెచ్‌లో పని చేస్తున్న హెడ్‌ కానిస్టేబుల్‌ శశిప్రసాద్‌ బైక్‌పై వెళ్తుండగా రాంగ్‌ రూట్‌లో వచ్చిన ఆటో ఢీకొన్నట్లు వన్‌ టౌన్‌ ఎస్‌హెచ్‌వో రఘుపతి గురువారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేలుడు పదార్థాలు స్వాధీనం : ఒకరిపై కేసు



స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలు

బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలోని పాత వీక్లీ మార్కెట్‌ వద్ద బుధవారం రాత్రి పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణానికి చెందిన నర్సగౌండ మడిగె నిర్మాణం చేపట్టేందుకు రాళ్లు అడ్డుగా ఉండడంతో వాటిని పేల్చడానికి పేలుడు పదార్థాలు తీసుకొచ్చాడు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని 40 జిలిటెన్‌ స్టిక్స్‌, స్టిక్స్‌ పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నర్సగౌండపై కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్‌ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య



భూమేశ్వర్‌(ఫైల్‌)

బాల్కొండ: ముప్కాల్‌ మండల కేంద్రానికి చెందిన పెంటు భూమేశ్వర్‌(57) ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. భూమేశ్వర్‌ గ్రామంలో కిరాణ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన భూమేశ్వర్‌ కిరాణ షాపు వెనుక గదిలో ఉరి వేసుకున్నాడు.

జీవితంపై విరక్తి చెంది వృద్ధుడు..



సాయిలు(ఫైల్‌)

రెంజల్‌: అనారోగ్య కారణాలతో జీవితంపై విరక్తి చెంది ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో చోటు చేసుకుంది. ఏఎస్సై బాబురావు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కండెపల్లి సాయిలు (64) కొంతకాలంగా నరాల నొప్పితో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది తాడ్‌బిలోలి శివారులోని అలీసాగర్‌ ఎత్తిపోతల కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.